# తెల్లవారని రాత్రి

రాత్రి అంతా దట్టంగా కురిసిన వాన వెలిసింది. పల్చగా నేలపై పరచుకుంటున్న నీరెండలో కడిగి ఆర బెట్టిన ముత్యంలా ప్రకృతి మెరిసిపోతోంది. ప్రహారీ ఆవర ణలో వార్ధక్యాన్ని సూచిస్తూ నింగిలోకి తొంగి చూస్తూన్న పున్నాగ చెట్టు ఆకులనుండి నీటిబొట్లు నేలమీద రాలి విం తగా శబ్దం చేస్తున్నాయ్. రాత్రి వానలో తడిసిన గడ్డి పోచలు చలిగాలి తాకిడికి వణికిపోతున్నట్లు తలుపులూపు తున్నాయి!

వీధి వరండాలో వాలు కుర్చీలో మేనువాల్చిన పరం ధామయ్యగారు ఒక్కసారి కళ్ళజోడు సవరించుకొని వీధి

గేటువంక దృష్టి సారించారు! ఎదటినుండి ఎనిమిదేళ్ళపిల్ల ఒక చేతితో పుస్తకాలు పుచ్చుకొని. మరో చేతితో పరికిణీ కుచ్చిళ్లు తడిసిపోకుండా పట్టుకొని స్కూలుకు బయలుదేరింది. ఆయనవంక ముద్దు ముద్దుగా చూసి, చిన్నగా నవ్వి తన దారిన తాను వెళ్ళిపోయింది.

గేటువంక రెండు నిమిషాలసేపు తదేక ధ్యానంతో చూశారు పరంధామయ్యగారు.

ఎక్కడా రంగమ్మగారు వస్తున్న జాడ లేదు!

నిరాశ ఆవరించిన మనస్సును పొదివి పట్టుకొని చూపులను వీధిగేటునుండి ఆకాశం వైపు మరల్చారు.

వాన వెలిసినా, ఆకాశంలో చెదురు మదురుగా నల్లని మబ్బులు అలుముకొని ఉన్నాయి. గాలి తాకిడికి తట్టుకోలేక పింజల్లా విడిపోయి నీలాకాశంపై పరచు కుంటున్నాయి ఊరికి కాపలా కాస్తున్న కొండలు మబ్బులతో ఆడుకుంటున్నాయి. సుందరమైన ఆ ప్రకృత పరికిస్తూ కొద్ది క్షణాలు తన్మయత్వంలో మునిగి పోయారాయన.

గదిలోని గడియారం ఎనిమిది గంటలు కొట్టింది!

ఏడు గంటలకే వచ్చే రంగమ్మగారు ఈ దినం ఎనిమిది గంటలయినా రాలేదు! “పాపం! ఆవిడ కూతురు మూడు దినాలనుండీ జ్వరంతో బాధ పడుతూందిట! నిన్న మరీ హెచ్చయిందిట! ఎలా ఉందో?”

ఏదో పెద్ద అవాంతరం వస్తేకాని సాధారణంగా ఆవిడ రావటం మానదు!

మరి, ఈ దినం వస్తుందో, రాదో?

నీరసంగా మరోసారి గేటువంక చూశారు పరంధామయ్యగారు.

రంగమ్మగారు వస్తున్న జాడ లేదు ఎక్కడా!

ఆలోచనలను చేతిమీది భగవద్గీత మీదకు మళ్లించి దాని మీద మనస్సు నిలిపే ప్రయత్నం చేశారు పరంధామయ్యగారు.

"ఏమండీ! రంగమ్మగారు వచ్చారా?" హీన స్వరంతో లోపలినుండి భార్య ప్రశ్నించింది.

"ఇంకా రాలేదు! వచ్చే వేళయింది!" భార్యను సముదాయించే ధోరణిలో అన్నారు.

లోపలినుండి దీర్ఘంగా నిట్టూర్పు వినబడింది.

అనాదిగా వస్తూన్న హిందూ సంప్రదాయాలను తు. చ. తప్పకుండా అనుసరించి, ఏభయిఏళ్ళ జీవితాన్ని మరో ధ్యాసలేకుండా, భర్త సుఖం కోసమే త్యాగంచేసి, ఇక ఏమీ ఇవ్వలేని స్థితిలో జీవచ్ఛవంలా మిగిలిపోయి, అసహాయ స్థితిలో చిక్కుకున్న భార్య నిట్టూర్పు అది!

చేతికర్ర ఆసరా చేసుకొని కుర్చీలో నించి లేచి గదిలోకి వెళ్ళారు. గదిలోని నిలువుటద్దంలో తన ప్రతిబింబం

స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిదినం అలవాటయిన దృశ్యమే అది! కాలచక్రం నలుపు చేసిన కనురెప్పలు, జీవితాన్ని పదేపదే గుర్తుచేస్తున్న తెల్లవెంట్రుకలు, యవ్వనంలోని అనుభవాలను పదిల పరుస్తున్న నుదుటి మీద సన్నని ముడతలు, మిగిలిపోయిన ప్రాభవాన్ని అనుక్షణం కాపలా కాస్తున్న గాజు బొమ్మల్లాంటి కనుపాపలు తనని మనిషిగా సూచిస్తున్నాయి! తన రూపాన్ని తదేకంగా చూసుకుంటుంటే జీవంలేని పొడి నవ్వు పెదవులపై క్షణంసేపు తిరుగాడి ఎక్కడికో ఎగిరిపోయింది.

టేబిలు మీది పౌడుం డబ్బీ మూత తెరచి ఒక పట్టు తీసుకొని హాలులోకి వచ్చారు పరంధామయ్యగారు.

రంగమ్మగారి రాకకోసం కిటికీలో నుండి గేటువైపు పరికించి చూశారు.

ఆవిడ వస్తున్న జాడ కన్పించలేదు!

హాలుకు ఆనుకొని ఉన్న అవతలి వైపు గదిలో భార్య పడుకొనిఉంది. తలవైపున ఉన్న టేబిలు మీద బత్తాయి తొనలు అందుకొనే ప్రయత్నం చేస్తోంది. ప్రక్కనే నీళ్ళతో ఉన్నగ్లాసు ఆమె చేతికి తగిలి క్రిందకు దొర్లి ముక్కలయింది.

భార్య స్థితి చూస్తుంటే ఆయనకు దుఃఖం ముంచుకు వచ్చింది!

"అయ్యో! గ్లాసు బద్దలయిపోయి నట్లుందండీ!" అంది భార్య.

"ఫరవాలేదు! ఈ తొనతీసుకో! నేనుగాజు ముక్కలు తీసి అవతల పారేస్తానులే!" అంటూ టేబిలు మీాది బత్తాయి తొనలు భార్యకు అందించి, గాజు ముక్కలన్నీ కిటికిలోనుండి అవతల పారవేశారు.

"మీాకు సేవలు చేయవలసిన వయసులో మీా చేత చేయించు కుంటున్నా!" అంటూంది ఆమె తగ్గు స్వరంతో. ముకుళించుకొని ఉన్న ఆమె కను రెప్పల చాటునుండి కన్నీరు ఉబికి తలగడ మీాదికి జారి పోతూంది. భార్య ముఖం వంక చూడలేక వరండాలోకి వచ్చేశారు.

వరండా గోడకు ఉన్న పాత కాలెండర్లు వాటి రంగులు మార్చుకొని వెల వెలపోతున్నాయి. సోఫాలు దుమ్ము పట్టి చూడడానికి అసహ్యంగా ఉన్నాయి. పైన వేలాడుతున్న పాత ఫాను తనవంక దీనంగా చూస్తున్నట్లు అన్పించింది. తను అభిమానించిన వ్యక్తులందరు తనని వదిలి వెళ్ళి పోయినా, ఈ వస్తువులు మాత్రం ఇంటిని, తనను అంటి పెట్టుకున్నాయి.

భారంగా అడుగులు వేస్తూ వాలుకుర్చీ వద్దకు చేరుకొని ఆసీనులయ్యారు పరంధామయ్యగారు. కళ్ళజోడు సవరించుకొని గేటువంక మరొకసారి ఆశగా చూసారు.

రంగమ్మగారు ఇంకా రాలేదు!

ఇక ఈ పూటకి ఆవిడ వస్తుందనే ఆశకూడా క్షణ క్షణానికీ దూరమవుతూంది!

రంగమ్మగారు వంట మనిషి! ఎనిమిది సంవత్సరాలుగా ప్రతిపూటా ఈ ఇంట్లో ఆవిడే వంట చేస్తూంది. అభిమాను లందరు దూరమయిన పరిస్థితులలో తనకు, తన భార్యకు సహాయంగా నిలిచింది! చాలా నిజాయితీ అయిన మనిషి ఆవిడ!

పరంధామయ్యగారికి ఎనిమిది సంవత్సరాల క్రితం జీవితంలో మళ్ళీ కోలుకోలేని పెద్ద దెబ్బ తగిలింది! అదే ఆయన భార్యకు కళ్ళుపోవటం! ఆపరేషను చేస్తూండగా ప్రమాదవశాత్తు జరిగిన ఆ సంఘటన ఆమె జీవిత గతినే మార్చివేసింది. అప్పటినుండీ జీవచ్ఛవంలా మంచాన్నే అంటిపెట్టుకొని బ్రతుకుతూంది ఆమె!

భార్యకు కళ్ళు పోయినప్పటి నుండీ రంగమ్మగారే వంట చేస్తూంది! ఆవిడ ఏ పూట రాకపోయినా పస్తు పడుకో వలసిందే! అందుకే తెల్లవారి నప్పటినుండి, రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు ధ్యాస అంతా ఆవిడ రాక పోకల పైనే!

రంగమ్మగారి ఇల్లు ఆ వీధి చివరనే ఉంది.

ఆమెకు వయస్సులోనే భర్త గతించాడు. అప్పటి నుండీ కూతురివద్దే కాలం గడుపుతూంది. ఉదయాన్నే ఇచ్చి టికివచ్చి, వండి తనకు, భార్యకు వడ్డించి, భోజనాలు ముగి

సాక గిన్నెలు కడిగి యథాస్థానంలో ఉంచి వెళ్ళిపోతుంది. ప్రతి ఉదయం, సాయంత్రం ఇదే ఆవిడ చర్య!

సన్నచి తుంపర్లు చెదురు మదురుగా, మళ్ళీ ప్రారంభమయ్యాయి. పున్నాగ చెట్టుమీది పాలపిట్ట తడి రెక్కలు విదుల్చుకొని ఎక్కడికో ఎగిరిపోయింది. వీధిలో నుండి ఎవరో నడచి వస్తున్న శబ్దమైతే, ఆత్రంగా దృష్టి అటు వైపు సారించారు పరంధామయ్యగారు! ఎవరో విద్యార్థులు నవ్వుకుంటూ స్కూలుకి వెళ్ళి పోతున్నారు.

రంగమ్మగారు వస్తున్న జాడలేదు.

నీరసంగా నిట్టూర్చి పుస్తకంలో తలదూర్చటానికి ప్రయత్నించి సఫలీకృతులు కాలేక పోయారాయన. వర్తమానాన్ని గతంతో పోల్చిచూస్తే ఎక్కడా సామ్యం కనిపించడంలేదు. గాలి, వెలుతురు సోకని గదిలో బంధించబడినట్లు అనిపిస్తూంది ఆయనకు జీవితం! మనసు ఎంత అణచి పెట్టినా లొంగకుండా ప్రాభవంతో గడచిన పాత జీవితాన్ని గుర్తుకు తెస్తూంది!

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో తను తహశిల్‌దారు పదవి నిర్వహించాడు. తన కార్యదీక్షకు, తెలివితేటలకు పై అధికారులు మెచ్చుకోవటం, తనపై ప్రత్యేక అభిమానంతో సంచరించటం తలచుకుంటే తనువు పులకరిస్తుంది. అందుకే తన శక్తి సామర్థ్యాలతో రిటైరయ్యే నాటికి కలెక్టర్ కాగలిగాడు.

ఆనాటి ప్రాభవం గుర్తుకు వస్తూంటే కనులు చెమర్చాయి! జీవితంలో అన్ని సుఖాలూ ఇచ్చిన భగవంతుడు ఈ ఆఖరి దినాలలో మాత్రం శాంతి లేకుండా చేశాడు! ఒక్కగానొక్క కొడుకు డిగ్రీపొంది ఉద్యోగంలో చేరిన ఇరవై దినాలలోనే కారు ప్రమాదంలో మరణించాడు. అది తనకు, భార్యకు తీరని లోటుగా మిగిలిపోయింది. చేతికి అంది వచ్చాడనుకున్న కొడుకు కాలంలో లీనమయ్యాడు!

రిటైరయ్యాక విశాఖ పట్టణంలో ఇల్లు కొనుక్కొని ఈ కొత్తరకం జీవితానికి అలవాటు పడ్డాడు. భార్య వంట పని పూర్తి చేసుకొని తనవద్ద కూర్చొని భగవద్గీత చదువుతూవుంటే, తనకన్నులు మూసుకొని తన్మయత్వంతో వాడు. గీత పఠిస్తూవుంటే ఆమె కన్నులు, ముఖం వింత తేజస్సుతో వెలిగి పోయేవి.

కాని, వక్రించిన విధి ఆమెను అంధురాలిగా చేసింది! కన్నులు పోయిన నాటినుండి మంచం దిగకుండా చీకటి జీవితాన్నే గడుపుతూంది! ఇక ఆమె జీవితానికి వెలుగు లేదు!

భార్యకు ఆపరేషన్ జరిగిన నాటినుండీ ఆ ఇంట్లో రంగమ్మగారే దీపం వెలిగిస్తున్నారు. ఆవిడ ఎంతో వినయ విధేయులతో సంచరించి, తన పనులు తానే నిర్వర్తించుకొని వెళ్ళిపోతూంది!

ఏ ఒక్క పూటయినా రంగమ్మగారు రాకపోతే ఆ దినం నిద్రపట్టదు పరంధామయ్యగారికి. ఆవిడ చేతివంట తినకపోతే మెదడు పని చెయ్యదు! మతి చెడి మనసు గంతులు వేస్తుంది! అందుకే వృద్ధాప్య సమయంలో తనకు, తన భార్యకు రంగమ్మగారే సర్వస్వం అయ్యారు!

"ఇంకా రమణమ్మగారు రానట్లుందే!" ఓపికలేని స్వరంతో భార్య నీరసంగా అడుగుతూంది.

పరంధామయ్యగారు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు.

గదిలో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. రంగమ్మగారు వచ్చే సమయం మించిపోయింది. బహుశః రారేమో! పాపం, ఆవిడ కూతురికి ఎలా ఉందో?

క్షణాలు గడుస్తున్న కొలదీ పరంధామయ్యగారి పేగులో ఎక్కడో ఆకలి కదలిక ఆరంభమయింది. వీచికలా ప్రారంభమయిన కదలిక పెరిగి పెద్దదై మతిపోగొడు తూంది. శరీరం అంతా నీరసం ఆవరించింది!

చేతికర్ర సాయంతో మెల్లగా లేచి, తూలిపోతున్న శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అలమారులోని డబ్బాతీసి గుప్పెడు అటుకులు పాలగిన్నెలో నానవేసి వచ్చి వాలుకుర్చీలో కూర్చున్నారు గేటువంక చూస్తూ!

'రంగమ్మగారు సాయంత్రమయినా, వస్తారో, రారో?'

కళ్ళజోడుతీసి బల్లమీద పెట్టి వాలుకుర్చీలో నడుం వాల్చారు.

వాన తుంపర్లు పూర్తిగా తగ్గిపోయాయి. లేత ఎండ మబ్బులను చీల్చుకొని బయటకు రావటానికి ప్రయత్నాలు చేస్తోంది. గాలి తాకిడికి పున్నాగ పువ్వులు నేలమీద రాలి పోతున్నాయి. వాటి వాసనతో గాలి వింత పరిమళం పులుముకుంటోంది.

పరంధామయ్యగారు నీరసంగా కళ్లు మూసుకున్నారు.

మనసులో ఏవో అర్థంకాని అస్పష్టమయిన దృశ్యాలు కదిలి మాయమయిపోతున్నాయి! కనురెప్పల చాటునుండి భయంకర మయిన నల్లని నీడలు బయటకు వచ్చి భీకరంగా నర్తిస్తున్నాయి. మనసు చెప్పలేని ఆందోళనకు లోనయింది.

మెల్లిగా కళ్ళు విప్పిచూశారు పరంధామయ్యగారు! రోడ్డు మీద ఏదో కలకలం! జన సమూహంలో ఏదో కదలిక! ప్రశాంత వాతావరణంలో ఏదో సంచలనం! ఎవరో సన్నగా విలపిస్తున్న భావన! కుర్చీలో నుండి లేచి వరండా చివరకు వెళ్ళి రోడ్డుమీదకు దృష్టి సారించారు.

రోడ్డు మీద ఏదో శవాన్ని తీసుకెళుతున్నారు! శవం కాళ్ళనుండి మెడవరకు తెల్లని గుడ్డ కప్పబడిఉంది. తలవైపున ఉంచిన అగరువత్తుల ధూమం వర్తులంగా లేచి

గాలిలో కలిసిపోతూంది. వాహనం ముందు రంగమ్మగారి కొడుకు కుండలో నిప్పుతీసుకొని నడుస్తున్నాడు. శవం వెనుక కొందరు పెద్ద మనుష్యులు అనుసరిస్తున్నారు రకరకాలుగా మాట్లాడు కుంటూ!

"పాపం! రాయిలాంటి మనిషి! నిన్నరాత్రి కలెక్టరు గారి ఇంట్లో వంటకూడా వండిదంట! అర్థరాత్రి గుండెలో నొప్పి వచ్చిందిట! అంతే! తెల్లవారే సరికి అంతా అయి పోయింది! ఎంతసేపు కావాలి, ప్రాణం పోవటానికి!"

అంతే! తరువాత వారి సంభాషణ వినబడలేదు పరంధామయ్యగారికి..

చేతికర్ర పట్టుతప్పి నేలమీాది పడిపోయింది!

గాజు కాయల్లాంటి కనుపాపల వెనుం నుండి ఉబికిన రెండు కన్నీటి చుక్కలు రెప్పల వెనకనే ఆగిపోయాయి!

[ఆంధ్రప్రభ]

♦ ♦ ♦ ♦